సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 16 । మే । 2023

ఐసీఎస్ఈలో ప్రతిభ

షాద్‌నగర్: పట్టణానికి చెందిన శశివర్ధన్ ఇండియన్ సర్టిఫికెట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (ఐసీఎస్ఈ) పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పరిధిలోని ముత్తంగిలో ఉన్న శ్రీసాయి పబ్లిక్ స్కూల్‌లో పదో తరగతి (ఐసీఎస్ఈ) చదివాడు. ఈ పరీక్ష ఫలితాల్లో శశివర్ధన్ 600 మార్కులకు గాను 590 మార్కులు సాధించాడు. పర్సంటైల్‌లో 98.8 శాతం సాధించి దేశ స్థాయిలో ఆరో ర్యాంకు సాధించాడు.

పర్యావరణ జీవన శైలిని అలవర్చుకోవాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: పర్యావరణ జీవన శైలిని అలవర్చుకోవాలని అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్ పేర్కొన్నారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 'మిషన్ లైఫ్ -లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్' కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రతీక్ జైన్ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ప్రతిజ్ఞ అనంతరం జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. పర్యావరణ జీవనశైలిని అలవర్చుకునేలా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం, నిషేధించడం చేయాలని తెలిపారు. వర్షపు నీరు ఆదా చేయాలన్నారు. వీలైనంతగా ఏసీ తక్కువగా వాడాలని, సైకిల్‌ను ఉపయోగించాలని చెప్పారు. పర్యావరణ హిత జీవనశైలి గురించి చైతన్యపర్చాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా భూమిపూజ

- ఘనంగా 'ఫాక్స్‌కాన్' పరిశ్రమకు శంకుస్థాపన
- హాజరైన మంత్రులు కేటీఆర్, సబిత, కంపెనీ ప్రతినిధులు


భూమిపూజలో పాల్గొన్న మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి, ఫాక్స్‌కాన్ ఇంటర్ కనెక్ట్ టెక్నాలజీ సీఈఓ సిడ్నీలూ, జెడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డి తదితరులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అంతర్జాతీయ దిగ్గజ కంపెనీ 'ఫాక్స్‌కాన్' భూమిపూజ కార్యక్రమం సోమవారం కొంగరలో ఘనంగా జరిగింది. స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐటీశాఖ మంత్రి కేటీఆర్, విద్యాశాఖ మంత్రి సబితా రెడ్డి, కలెక్టర్ హరీశ్ సహా ఫాక్స్‌కాన్ ఇంటర్ కనెక్ట్ టెక్నాలజీ సీఈఓ సిడ్నీలూ, జెడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత క్యామ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా స్థానికులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు వచ్చే ఐదేళ్లలో కొంగర రూపురేఖలు పూర్తిగా మారబోతున్నాయని చెప్పారు. మరో హైటెక్‌సిటీలా వెలగబోతుందని చెప్పారు. గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ మ్యాప్‌లో తెలంగాణ సుస్థిరస్థానం సంపాదించుకుందని ఫాక్స్‌కాన్ ఇంటర్ కనెక్ట్ టెక్నాలజీ సీఈఓ సిడ్నీలూ అన్నారు. త్వరలోనే ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభించి, స్థానికులకు పెద్ద సంఖ్యలో ఉపాధి కల్పిస్తామన్నారు. ఫాక్స్‌కాన్ కంపెనీ ఏర్పాటుకు జిల్లాను ఎంపిక చేయడం అభినందనీయమని విద్యాశాఖమంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాంతం రూపురేఖలు పూర్తిగా మారబోతున్నాయన్నారు. ఒకవైపు పరిశ్రమలు ఏర్పాటు చేయించి పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు కల్పిస్తూనే.. మరోవైపు డిండి, శివన్నగూడం ప్రాజెక్టులను పూర్తి చేయించి ఈ ప్రాంతానికి సాగు నీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు.

సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు

కందుకూరు: జిల్లా పరిధిలో ఫ్యాక్స్‌కాన్ సంస్థకు భూమిపూజ చేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి సీఎం కేసీఆర్‌ను సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి ధన్యవాదాలు తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

ఓబీసీ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: నాగోలు శుభం కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 18న జరగనున్న బీజేపీ ఓబీసీ మోర్చా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఓబీసీ పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వకుండా విద్యకు దూరం చేస్తోందన్నారు. ఓబీసీల సంక్షేమాన్ని గాలికి వదిలి ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. కేంద్రం కేబినెట్‌లో 27 మందికి ఓబీసీలకు చోటు కల్పిస్తే, రాష్ట్ర ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు.

విన్నపాలు వినవలె..

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణిలో వచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 168 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా అధికారులు శాఖల వారీగా స్వీకరించిన అర్జీలపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సర్కార్ ప్రోత్సాహం

- 615 మండల కేంద్రాల్లో సీఎం కప్ క్రీడాపోటీలు
- 17 వేల క్రీడా ప్రాంగణాల నిర్మాణం
- గుడి, బడిలాగే క్రీడా మైదానాలను గౌరవించాలి
- సాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్



మాట్లాడుతున్న ఆంజనేయగౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్: గ్రామీణ క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని క్రీడా ప్రాధికార సంస్థ (సాట్స్) చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ అన్నారు. సోమవారం రంగారెడ్డిజిల్లా బాటసింగారంలో అబ్దుల్లాపూర్‌మెంట్ మండలం సీఎం కప్–2023 క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 615 మండల కేంద్రాల్లో క్రీడా పోటీలు ప్రారంభమైనట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో 17వేల క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు భారీ నగదు, విలువైన ఇళ్ల స్థలాలను ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఉద్యోగాల్లో రెండు శాతం, ప్రొఫెషనల్ కోర్సుల్లో శాతం రిజర్వేషన్లను తమ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. 1.5 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీతో పాటు మరో లక్ష ఉద్యోగాల భర్తీ ప్రక్రియ సాగుతోందని వివరించారు. ఐటీకి అడ్డాగా మారిన తెలంగాణ రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు దక్కుతున్నాయని ఆయన వివరించారు. భారీ పరిశ్రమలను జిల్లాలకు సైతం విస్తరించడం వల్ల గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో తమ సత్తా చాటుతున్నారని, నిఖత్ జరీన్ తదితరులను ఆయన ఉదహరించారు. గుడి, బడిలాగే క్రీడా మైదానాలను గౌరవించాలని, క్రీడా ప్రాంగణాల కేర్ టేకర్లుగా యువకులు బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బుర్ర రేఖా, జడ్పీటీసీ దాసుగౌడ్, వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా క్రీడల శాఖ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి, తహసీల్దార్ అనితారెడ్డి, ఎంపీడీఓ మమతాబాబు, ఎంపీఓ వినోద, మండల విద్యాశాఖాధికారి హీర్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులతో సాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్ తదితరులు

'ఉగ్ర సీన్' రీ కన్‌స్ట్రక్షన్

- ఆరుగురు నిందితులను సిటీకి తీసుకువచ్చిన ఏటీఎస్
- నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటన
- నేడు సిద్దిపేట శివారుకు తీసుకువెళ్లే అవకాశం



సాక్షి, సిటీబ్యూరో: మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్) అధికారులకు హైదరాబాద్‌లో చిక్కిన ఐదుగురు ఉగ్రవాదులు దర్యాప్తును తప్పుదోవపట్టించే ప్రయత్నం చేశారా..? ఔననే అంటున్నారు అధికారులు. ప్రాథమిక విచారణలో వీళ్లు చెప్పిన విషయాలకు.. సీన్ రీ కన్‌స్ట్రక్షన్‌లో గుర్తించిన అంశాలకు పొంతన లేదని స్పష్టం చేస్తున్నారు. తాజాగా చేపట్టిన క్షేత్రస్థాయి విచారణలో అనేక కీలకాంశాలు గుర్తించారు. గత వారం సిటీలో అరెస్టు అయిన ఐదుగురితో పాటు భోపాల్‌లో చిక్కిన సూత్రధారి యాసిర్ ఖాన్‌ను ఏటీఎస్ అధికారులు సోమవారం హైదరాబాద్ తీసుకువచ్చారు. వీరిని నగరంలోని పలు ప్రాంతాలకు తీసుకువెళ్లి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేశారు. మంగళవారం సిద్దిపేట శివారులో ఈ ప్రక్రియ పూర్తి చేసి తిరిగి భోపాల్ తరలించనున్నారు. మధ్యప్రదేశ్ ఏటీఎస్ అధికారులు గత వారం సిటీలో అరెస్టు చేసిన మహ్మద్ సలీం, అబ్దుల్ రెహ్మాన్, మహ్మద్ అబ్బాస్ అలీ, షేక్ జునైద్, మహ్మద్ హమీద్‌లతో పాటు భోపాల్‌లో చిక్కిన యాసిర్ ఖాన్‌లను సోమవారం సిటీకి తీసుకువచ్చారు. ఈ ఉగ్రవాదులంతా సలీం, రెహ్మాన్, సల్మాన్ (ప్రస్తుతం పరారీలో ఉన్నాడు) ఇళ్లల్లో సమావేశాలు నిర్వహించారు. వీటిలో సలీం ఇంట్లో నిర్వహించిన ప్రతీ సమావేశానికీ యాసిర్ హాజరయ్యాడు. ఈ నేపథ్యంలోనే ఏటీఎస్ అధికారులు ఈ ఆరుగురిని సమావేశాలు జరిగిన ఇళ్లకు, ఐదుగురినీ వారి వారి ఇళ్లకు తీసుకువెళ్లిన అధికారులు పలు అంశాలను రికార్డు చేశారు. తన మాడ్యుల్ ప్రాక్టీస్ చేయడానికి సలీం ఎంజే మార్కెట్ సమీపంలోని ఓ ఆయుధాల విక్రయ దుకాణం నుంచి మూడు ఎయిర్ పిస్టల్స్, పిల్లెట్స్ ఖరీదు చేశారు. అతన్ని ఆ షాపు వద్దకు తీసుకువెళ్లిన ఏటీఎస్ అధికారులు దానికి సంబంధించిన రికార్డులు స్వాధీనం చేసుకోవడంతో పాటు యజమాని వాంగ్మూలం నమోదు చేశారు. ఈ ఉగ్రవాదులు అరెస్టు అయిన సమయంలో తాము నగర శివార్లలోని అనంతగిరి అడవుల్లో ఎయిర్ పిస్టల్స్‌తో ఫైరింగ్ ప్రాక్టీస్ చేసినట్లు పోలీసులకు చెప్పారు. వీరిని లోతుగా విచారించిన ఏటీఎస్ అధికారులు దర్యాప్తును తప్పుదోవ పట్టించడానికే ఇలా చెప్పారని గుర్తించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారంతో పాటు సాంకేతిక ఆధారాలను బట్టి వీరు టోలిచౌకిలోని ఓ ప్రైవేట్ షూటింగ్ అకాడమీలో ఫైరింగ్ చేసినట్లు గుర్తించారు. అక్కడకు వెళ్లిన ఏటీఎస్ టీమ్ రికార్డులు స్వాధీనం చేసుకుని, స్టేట్‌మెంట్స్ రికార్డు చేశారు. పరారీలో ఉన్న సల్మాన్ సహా నగరంలో అరెస్టైన ఆరుగురు తరచూ సిద్ధిపేటకు వెళ్లి వచ్చినట్లు తేలింది. అక్కడకు ఎందుకు వెళ్లారనే కోణంలో విచారించగా.. పట్టణ శివారులోని నిర్మానుష్య ప్రాంతంలో ఓ ప్రార్థనా స్థలం ఉందని, అక్కడా తాము కొన్ని సమావేశాలు నిర్వహించామన్నారు. కత్తులు, గొడ్డళ్లు వినియోగించి దాడి చేయడం, విల్లులతో బాణాలు వేయడం, ఫిట్‌నెస్ ట్రైనింగ్స్ చేసినట్లు అంగీకరించారు. దీంతో ఈ ఉగ్రవాదులను మంగళవారం సిద్ధిపేట శివారుకు తీసుకువెళ్లాలని ఏటీఎస్ అధికారులు భావిస్తున్నారు. హైదరాబాద్ మాడ్యుల్‌లో కీలకంగా వ్యవహరించిన సలీం, రెహ్మాన్ గతంలో మరికొందరిని ఉగ్రవాదం వైపు ఆకర్షించేందుకు యత్నించారు. తాము మతపరమైన కార్యక్రమాలు చేపడుతున్నామని నమ్మబలికి వారికి తమ ఇళ్లల్లో నిర్వహించిన సమావేశాలకు రప్పించారు. వీరు చెప్తున్న అంశాలు రెచ్చగొట్టేవిగా, అనుమానాస్పదంగా భావించిన వారంతా వీరికి దూరయమ్యారు. అలా దూరమైన వారిని ఈ కేసులో సాక్షులుగా మార్చాలని ఏటీఎస్ నిర్ణయించింది. నిందితులను దోషులుగా నిరూపించడానికి ఇవే కీలకమని రాష్ట్ర నిఘా వర్గాలతో కలిసి వారిని గుర్తించే పనిలో ఉన్నారు. సోమవారం వరకు చంద్రాయణగుట్ట, హఫీజ్‌బాబానగర్ ప్రాంతాలకు చెందిన ఇద్దరిని గుర్తించారు. నగరంలోని ఏటీఎస్ టీమ్ వీరి వాంగ్మూలాలు నమోదు చేసింది. ఈ ఉగ్రవాదుల ఏటీఎస్ కస్టడీ గడువు శుక్రవారంతో ముగియనుంది.

తొమ్మిదేళ్లలో ఎకరానికైనా నీళ్లిచ్చారా?

- ప్రాణహిత- చేవెళ్లను నిర్వీర్యం చేశారు
- కాళేశ్వరం ప్రాజెక్టు చెక్‌డ్యామ్‌లకే పరిమితం
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ధ్వజం


మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

కొందుర్గు: తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే నిధులు, నీళ్లు, నియామకాలు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ మాట తప్పారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు స్థలం వద్ద ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టును రూపకల్పన చేశారని, అయితే ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాణహిత ప్రాజెక్టును చంపేశారని విమర్శించారు. జూరాల నుంచి నీళ్లు తరలించి సముద్రానికి 675 మీటర్ల ఎత్తులో ఉన్న షాద్‌నగర్ నియోజకవర్గం లక్ష్మీదేవిపల్లి వద్ద పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మిస్తే మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలు సస్యశ్యామలం అవుతాయని ఉద్దేశంతో కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే జీఓ విడుదల చేసినట్లు తెలిపారు. అలాంటి ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో పూర్తిగా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ప్రస్తుతం ఇక్కడ సాగునీరు కాదు తాగునీరు ఇస్తామని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేసీఆర్ తన తొమ్మిదేళ్ల అదనంగా ఒక్క ఎకరానికైనా సాగునీరు ఇచ్చారా అని ప్రశ్నించారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు తమ మానసపుత్రిక అని, ప్రాజెక్టు నిర్మించకుంటే ఓట్లు అడగమని చెప్పిన ఎమ్మెల్యే, ఎంపీలు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని ప్రజలను ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు.

రాష్ట్ర వాటాను వినియోగించుకోవడం లేదు

రాష్ట్రానికి వచ్చే సాగునీటి వాటాను వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి అన్నారు. కృష్ణా జలాల్లో 70 శాతం నీళ్లు వాడుకోవాల్సి ఉండగా.. కనీసం 30 శాతం నీటిని కూడా వాడుకోవడం లేదన్నారు. జూరాల నీటిని తరలించి లక్ష్మీదేవిపల్లి వద్ద పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మిస్తే ఈ ప్రాంత ప్రజలకు తాగునీరు, సాగునీరు అందుతుందని తాము చూయిస్తే కేసీఆర్ ప్రభుత్వం రీ డిజైన్ పేరుతో ప్రాజెక్టును పూర్తిగా సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, వికారాబాద్ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, ప్రజాగాయకుడు గద్దర్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనా రెడ్డి, విద్యార్థి జేఏసీ నాయకులు విజయ్‌కుమార్, రిటైర్డ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి రాజు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాహ విందుకు వెళ్తున్న ఆటో బోల్తా

- ఎనిమిది మందికి గాయాలు
- డ్రైవర్ పరార్
- క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే


క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్


షాద్‌నగర్: వివాహ విందుకు వెళ్తున్న ఆటో బోల్తా పడి పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం వెంకన్నగూడ తండా శివారులో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. కొత్తూరు మండలం ఏనుగు మడుగు తండాకు చెందిన 30 మంది సోమవారం సాయంత్రం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బాపన్‌గుట్ట తండాకు అశోక్ లేలాండ్ వాహనంలో వెళ్తున్నారు. మార్గమధ్యలో కొండన్నగూడ గ్రామ శివారులో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రవి, కమ్లి, సిద్దు, హన్య, గోపాల్, లక్ష్మి, దివ్య, హనిరాం తీవ్రంగా గాయపడ్డారు. వ్యాన్ డ్రైవర్ మద్యం సేవించి ఉండడంతోనే ప్రమాదం సంభవించిందని ప్రయాణికులు వాపోతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ వారిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పరారయ్యాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు.

డబ్బులు, సెల్‌ఫోన్ కోసం కూలీ హత్య


సతీష్ మృతదేహం

మొయినాబాద్: డబ్బులు, సెల్‌ఫోన్ దొంగిలించేందుకు ఓ అడ్డా కూలీని ఇద్దరు దుండగులు హత్య చేశారు. ఈ ఘటన మొయినాబాద్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ డీకే.లక్ష్మీరెడ్డి తెలిపిన ప్రకారం.. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం ఒత్తుగండ్ల గ్రామానికి చెందిన కావలి సతీష్(40) భార్యతో కలిసి రెండేళ్ల క్రితం మొయినాబాద్‌కు వలస వచ్చారు. ముస్లిం బస్తీలో ఉంటూ అడ్డాకూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం రాత్రి సతీష్ పట్టణంలోని కాశీనాథ్ గ్రౌండ్‌లో మద్యం సేవిస్తూ కూర్చున్నాడు. అదే సమయంలో మండల పరిధిలోని పెద్ద మంగళారం గ్రామానికి చెందిన దేవేందర్ మరో వ్యక్తి అక్కడికి వచ్చి మద్యం సేవించారు. సతీష్ వద్ద ఉన్న రూ.8వేల నగదున్నట్లు గమనించిన దుండగులు ఆయన తలపై సిమెంట్ ఇటుకతో మోది హత్య చేశా రు. సెల్‌ఫోన్, నగదు దోచుకున్నారు. సోమవారం ఉదయం అటుగా వెళ్లినవారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు వివరాలు సేక రించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కొడుకు, కూతరు ఉన్నారు. కాగా గ్రౌండ్‌లో తచ్చాడుతున్న దేవేందర్‌ను పోలీ సులు అదుపులోకి తీసుకుని విచారిచంగా తానే హత్య చేశానన్నాడు. మద్యం మత్తులో ఉండడంతో ఇంకా సమాచారం సరిగా ఇవ్వడం లేదని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

యువతి అదృశ్యం


కళావతి (ఫైల్)

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. పహాడీషరీఫ్ గ్రామానికి చెందిన మర్ల కృష్ణ కుమార్తె కళావతి(19) ఎనిమిదో తరగతి వరకు చదువుకుని ఇంటి వద్దే ఉంటుంది. ఈ నెల 13న కృష్ణ దంపతులు పని నిమిత్తం బయటికి వెళ్లారు. అదే రోజు మధ్యాహ్నం తిరిగి వచ్చేసరికి యువతి కనిపించలేదు. ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం రాత్రి కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


నిధుల ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: గ్రామాలు, తండాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాలాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న సీసీ రోడ్లకు సంబంధించి రూ.15 లక్షల నిధుల ప్రొసీడింగ్స్‌ను ఆయన స్థానిక నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం చేస్తున్నాని.. ఇందులో ప్రజలు భాగస్వామ్యం అవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్‌నాయక్, పంతునాయక్, వార్డు సభ్యులు జగన్, రాజేందర్, శంకర్, చల్లంపల్లి సర్పంచ్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి


చేవెళ్ల: పామెన గ్రామంలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్: యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ మినీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు ప్రభుత్వం ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసిందన్నారు. క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని సూచించారు. గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభ వెలికితీసేందుకు ఈ పోటీలు ఉపకరిస్తాయన్నారు. విద్యార్థులు చదువు, క్రీడలతో పాటు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అనురాధ, వివిధ పాఠశాలల పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

చేవెళ్ల: యువతలోని క్రీడా సామర్థ్యాన్ని వెలికితీసేందుకే సీఎం కప్ మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని పామెన గ్రామంలోని తెలంగాణ క్రీడాప్రాంగణంలో సర్పంచ్ మల్లారెడ్డితో కలిసి ఎమ్మెల్యే క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం ప్రతీ గ్రామంలో క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేసిందన్నారు. మండల స్థాయిలో ప్రారంభించిన ఈ పోటీలు రాష్ట్రస్థాయి వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ పోటీల్లో అథ్లెటిక్స్, వాలీబాల్, ఫుట్‌బాల్, ఖోఖో, కబడ్డీ తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణచారి, యూత్ మండల అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, ఎంపీడీఓ రాజ్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీఓ విఠలేశ్వర్‌జీ, ఆర్‌ఐ రాజేశ్ నాయకులు వెంకటేశ్, విజయ్, యాదగిరి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల ఆక్రమణలపై ఏం చర్యలు తీసుకున్నారు?

నివేదిక ఇవ్వాలని మున్సిపల్ అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల ఆక్రమణపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని హైకోర్టు అధికారులను ఆదేశించింది. పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను జూలై 27కు వాయిదా వేసింది. 25 అడుగుల వెడల్పు ఉన్న రోడ్లను ఆక్రమించి పలు నిర్మాణాలు చేపడుతున్నారని మున్సిపాలిటీకి చెందిన మంగళంపల్లి ఇందిరా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ప్రధాన రోడ్డు కుంచించుపోయి 17 అడుగులకు వెడల్పునకు చేరిందన్నారు. 8 అడుగులు ఆక్రమణకు గురైందన్నారు. పాదచారులు నడిచేందుకు సైతం ఇబ్బందిగా మారిందని చెప్పారు. వాహన రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని పిటిషన్‌లో వెల్లడించారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టింది. ఆక్రమణల తొలగింపునకు మున్సిపల్ కమిషనర్ ఇప్పటికే చర్యలు తీసుకున్నారని స్టాండింగ్ కౌన్సిల్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఏం చర్యలు తీసుకున్నారో తదుపరి విచారణలోగా నివేదిక అందజేయాలని ఆదేశిస్తూ.. విచారణ వాయిదా వేశారు.

మహిళల కోసం ప్రత్యేక పథకాలు

తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ జుబేర్


అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ జుబేర్

షాద్‌నగర్: మహిళల కోసం తపాలాశాఖ ప్రత్యేక పథకాలను రూపొందించి అమలు చేస్తోందని తపాలాశాఖ షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ఎంఏ జుబేర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో తపాలాశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. మహిళల పొదుపు చేసుకునేందుకు మహిళా సమ్మాన్ పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. ఈ పథకంలో ప్రతీ మహిళ, మైనర్ బాలిక తరఫున సంరక్షుడు ప్రతీ నెల రూ.వేయి నుంచి రూ.2లక్షల వరకు పొదుపు చేయవచ్చని తెలిపారు. పొదుపు చేసే మొత్తానికి ప్రతీ ఏడాది 7.5శాతం వడ్డీ వస్తుందని చెప్పారు. అదేవిధంగా ఎవరికైనా అత్యవసరమైతే ఆరు నెలల తర్వాత పొదుపు చేసిన మొత్తం నుంచి 40శాతం తీసుకోవచ్చని తెలిపారు. ఈ పథకం మహిళలకు భవిష్యత్‌లో ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళలు, బాలికల కోసం రెండేళ్ల కాల పరిమితితో మహిళా సమ్మాన్ పొదుపు పథకాన్ని అమలు చేస్తుందని అన్నారు. మహిళలు పోస్టాఫీసుల్లో ఖాతాలు ప్రారంభించి డబ్బులను పొదుపు చేసుకోవాలని సూచించారు. మహిళల ఆర్థిక సాధికారత లక్ష్యంతో తపాలాశాఖ ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో తపాలాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.